# స్నేహప్రభ

-జంధ్యాల సాహితి



ఆఫీసుకి బయలుదేరుతున్న శ్రీకాంత్ భార్య శ్రీలత దగ్గర వచ్చి ''మానాన్న వచ్చి రెండురోజులయింది. మా చెల్లికి పెళ్లి కుదిరిందట, వారం రోజుల ముందుగ నన్ను తీసుకొని వెళ్లటానికి వచ్చారు... ఇంటికి పెద్ద అల్లుడు మీరు కూడ శలవు పెట్టి వస్తే బాగుంటుంది... పైగ ఆయన ఒక్కరు కాస్త సాయంగ కూడ వుంటారని...'' తను చెబుతునేవుంది. తనమానాన తను ఏమి ఎరుగనట్లు, విననట్టుగానే ఆయన రోడ్డు దాటారు.

శ్రీలత వాళ్ల నాన్నగారు వెంకట్రామయ్యగారు తను వచ్చినప్పటి నుంచి గమనిస్తునే వున్నారు. ఇద్దరి మధ్య ఏదో గొడవలు జరిగినాయని అందుకే ఇద్దరు ఎడమొఖం- పెడమొఖంగ వుంటున్నారని తెలుసుకున్నాడు.

..పోయిన ఏడాది శ్రీలతని పురిటికి తీసుకొని వెళ్లటానికి వచ్చినప్పుడు భార్యని విడిచి వుండలేనని తనుకూడ వస్తానని అన్నవాడు.. పైగ ఇద్దరు ఎంతో అన్యోన్యంగ వుండేవారు కూడాను. ఇప్పుడు ఎందుకు ఇలా జరిగిందో తనకి అర్థం కాలేదు.

..తన కూతురు విషయములో ఏ తప్పు లేదు. ఎంతో ఓర్పుతో, నేర్పుతో నెట్టుకొస్తున్నది. తనకి తెలుసు... తను వచ్చినప్పటినుంచి చూస్తునే వున్నాడు.. అయినదానికి కానిదానికి చీదరించుకోవటం చేస్తున్నాడు శ్రీకాంత్.

• • •

ప్రతి శుక్రవారం ఉదయం ఆఫీసుకి వెళ్లిన భర్త సోమవారం రాత్రికిగానీ ఇంటికి రారు. నెలకొకసారి క్యాంపు వుంటుందని తెలుసుకానీ ఇలా ప్రతివారం వుంటుంది అని భర్త చెప్పగానే ఆఫీసుకి ఫోన్ చేసి కనుక్కున్నది తను.. ఆ రెండురోజులు ఆఫీసుల్లో ఎవ్వరు వుండరని తాళం వేసి వుంటుందని తెలుసుకున్నది. తను అనుకున్నట్లుగానే తన అనుమానమే నిజమయింది. కాని తెలుసుకునేదెట్లా? తెలుసుకొని తనేం చెయ్యగలదు?

ఆ మరునాడు వెంకట్రామయ్యగారు వూరికి ప్రయాణమయ్యారు కూతురితో. ''నీ భర్త నీవు కలిసిరండి. ఇంటిదగ్గర చాలా పనులు మిగిలిపోయినాయి. ఒక్కడిని.. వస్తానమ్మా! అల్లుడుగారిని అడిగినట్లు చెప్పు!'' అంటూనే సంచీ తీసుకొని వెళ్లిపోయారు.

తన చెల్లెలు శ్రీవిద్య అంటే తనకెంతో ఇష్టం.. దాని పెళ్లికి వెళ్లకపోతే అది చాల బాధపడుతుంది. ఏం చెయ్యను?''

తండ్రి మనస్సు బాధపడిందని తనకి తెలుసు. ఇన్నాళ్లు ఏదైతే తెలియకుండ దాచివుంచానో అది ఈరోజు తెలిసిపోయింది. దాదాపు ఏడెనిమిది నెలలనుంచి ఇలా చేస్తున్నారాయన...

''పెళ్లయి మూడేళ్లకి పాప పుట్టింది. బాగానే వున్నారు. పురుడు పోసుకొని మూడవ నెల పాపతో ఇంటికి ఎంతో ఆశతో తిరిగి వచ్చానో నా ఆశలన్నీ అడియాశలయినాయి. తనకి తెలిసి ఆయనగారు ఏనాడు ఏ లోపం చెయ్యలేదు.. అన్యోన్యంగ వుండటం చూసి చాలామంది మా దంపతులని సీతారాముల దాంపత్యముతో పోల్చేవారు. ఆనాడు వాళ్ల అభిమానానికి ఎంతో సంతోషించేదాన్ని... కానీ ఆ దంపతులకు వియోగము సంగతే మరిచాను, ఈనాడు అదే జరిగింది నాకు.''

''సోమవారం రాత్రి పదిగంటలు దాటిన తరువాత వచ్చిన శ్రీకాంత్.. మీనాన్న వెళ్లిపోయినాడా! నీవు వెళ్లలేదేం?'' అన్నాడు కాస్త కటువుగా!!!

వెళ్లిపోయారు అని చెప్పి తను పాపకి పాలు కలపటానికని వంటింట్లోకి వెళ్లింది.

పాలు పడుతున్న తనని మళ్లీ పలకరించాడు.. ''నిన్ను పంపించలేదని నామీద అభాండం వెయ్యటానికా.. ఇక్కడే వున్నావు!'' విసుగ్గా, కోపంగ అన్నాడు భార్యతో శ్రీకాంత్.

మిమ్మల్ని అడిగి తీసుకొని వెళ్లదామని వున్నారు- మీరు రాకపోయేసరికి ఇంటిదగ్గర పనులు అలాగే వున్నాయని, మీకు చెప్పమని చెప్పి వెళ్లిపోయినారు. తను మాత్రం మెల్లగానే చెప్పి పాప ప్రక్కన పడుకుంది శ్రీలత.

మౌనంగ వుండటం శ్రీలతని చూస్తుంటే శ్రీకాంత్‌కి కోపం ఆగటం లేదు. ఆమెని

ఎలాగైన పంపించాలి అనుకొని...

''నన్ను ఎన్నిసార్లు అడగాలి.. నాకు ఇక్కడ పనులు లేవా? పెళ్లిళ్లకి పేరంటాలకి వెళ్లటానికి.. నీకుమల్లే నేను గాజులు తొడుక్కుని వున్నానా! నీకెలా కనిపిస్తున్నాను నేను.. నేను రాను అని ఆనాడే చెప్పాను.. నీవు వెళ్లి ఎన్నిరోజులున్న నాకభ్యంతరము లేదు'' అని గట్టిగ చెప్పి అటు తిరిగి పడుకున్నాడు శ్రీకాంత్.



భర్త మాటలకి శ్రీలత బాధపడుతు హాయిగ నిద్రపోతున్న పాప మీద చెయ్యి వేసి దగ్గరికి తీసుకొని తెలియరాని ఆనందంతో ఎప్పుడో నిద్రపోయింది తను.

రోజులు గడుస్తున్న భర్త నడవడిలో మార్పు కనిపించలేదు తనకి.

మరునాడు ఉదయం ఆఫీసుకు వెళ్లుతున్న భర్తతో.. ఈ ఒక్కరోజయిన త్వరగా వస్తారా... భర్త ముఖం చూస్తూ అడిగింది శ్రీలత.

శ్రీలత మాటలకి.. ''ఈరోజు అంత ప్రత్యేకత ఏంటి?'' అర్థంకాక అడిగాడు శ్రీకాంత్.. భార్య ముఖంలోని మార్పుని గమనిస్తూ...

''మీకు జ్ఞాపకం లేకపోవచ్చు.. జూన్ ఇరవై తొమ్మిది. ఈరోజు మన పెళ్లిరోజు..'' తల కొద్దిగ వంచుకొని అన్నది శ్రీలత.

భర్త నుంచి సమాధానం రాకపోయేసరికి తల ఎత్తి చూసింది శ్రీలత, అప్పటికే అతను కారు డోరు తీసి కూర్చున్నాడు.

తెలిసి తెలిసి అనవసరంగ చెప్పినందుకు మనసులో బాధపడింది శ్రీలత.

కారు వెళ్లిపోగానే తలుపు వేసి వంటింట్లోకెళ్లి గిన్నెల మీద మూతలు పెట్టి ఏమి తోచక వచ్చి మంచం మీద వచ్చి పడుకుంది తను..

మనసంత ఆలోచనలతో నిండిపోయింది..

పెళ్లయి ఇది మూడవ ఏడు. పెళ్లయిన క్రొత్తలో ఒక్క క్షణం కూడ తనని విడిచి వుండలేదు శ్రీకాంత్. ఆఫీసు నుంచి త్వరగ ఇంటికి వచ్చి ఏవేవో చిలిపి పనులు చేసేవారు. ప్రతి సాయంత్రం సినిమాకో, షికారుకో తీసుకొని వెళ్లేవారు. తన అదృష్టానికి మురిసిపోయేది!

రెండవ సంవత్సరం పాపని కడుపుతో వుంది. తనని నాన్నని చేస్తున్నందుకు తెగ మెచ్చుకొనేవాడు.. ఇంక తన మీద ప్రేమ పెరిగింది.. తనకి బాగా గుర్తు. ఒక రోజు...

పెళ్లిరోజు సాయంత్రం తొందరగ వచ్చి తనని షాపుకి తీసుకొని వెళ్లి మంచి డ్రస్ తీసుకొని ఇంటికి వచ్చి తనని ఆ డ్రస్ వేసుకోమని తెగ అల్లరి చేసారు.. ఆయన కోరిక ప్రకారమే వేసుకున్నాను.. కడుపుతో వుండటం మూలాన పొట్ట బయటికి కనిపించడంతో తనని బాగా ఏడిపించి నానా హంగామా చేసారు.

ఆరోజు రాత్రి ఆయనే నాకు అన్నం తినిపించి పసి పాపలాగ నన్ను నిద్రబుచ్చారు.

పాప ఏడుపుతో స్పృహలోకి వచ్చింది శ్రీలత.

• • •

భర్త ఈమధ్య స్నేహితుల వలన చాలా మారిపోయినాడని విన్నది.. తన భర్త అమాయకతని, డబ్బుని ఆసరా జేసుకొని ఆయన పాడుజేసి దురలవాట్లకి బానిసను చేసారు. ఆఖరికి తనంటే కూడ అసహ్యం ఏర్పడింది ఆయనికి.

భర్త ప్రవర్తనలో మార్పు ఏమి తనకి కనిపించలేదు. అంత నా ఖర్మ అని ఎక్కువగ ఆలోచించటం మానేసింది శ్రీలత. తలుపు చప్పుడు అవటంతో లేచి తలుపు తీసింది.. అంతే ఆశ్చర్యంతోపాటు ఆనందం కూడ కలిగింది తనకి.. తన బెస్టు ఫ్రెండ్ స్నేహప్రభ..

గుంటూరులో ఒకే కాలేజిలో చదివేవారు. ఇల్లు కూడ ప్రక్కప్రక్కనే.. తన పెళ్లయి హైద్రాబాదు వచ్చేసింది. అది వుద్యోగరీత్యా వైజాగ్ వెళ్లింది. కొద్ది నెలల నుంచి వుత్తరాలు రావటం లేదు. పెళ్లయి ఏ అమెరికా వెళ్లింది అనుకున్నాను కానీ ఇహ హఠాత్తుగా.. ఇక్కడికి వూడిపడుతుందని తను అనుకోలేదు.

''ఏంటే శ్రీలత. దెయ్యాన్ని చూస్తున్నట్టు చూస్తున్నావు. గుర్తుపట్టలేదా! స్నేహప్రభని..'' కాస్త గట్టిగ అరిచి దానిని తోసుకొని లోపలికి పోయింది బ్యాగ్‌తో...

దానిని చూసిన ఆనందంలో తనకి అయోమయంగ అయిపోయి అలా నిలబడిపోయింది..

తను కూడ లోపలికి వెళ్లి.. ''త్వరగ స్నానం చేయి. భోజనం చేసిన తరువాత మాట్లాడుకోవచ్చు'' అంటు సంతోషంతో వంటింట్లోకి వెళ్లింది శ్రీలత..

ఇద్దరు భోజనాలు చేసి కబుర్లలోకి దిగారు. స్నేహప్రభని చూడగానే తనకి ఎంతో హాయిగ, ఆత్మీయులను చూసినట్లుగ వుంది.. ముఖ్యంగ ఇప్పుడు తను వున్న పరిస్థితినిబట్టి తను ఒంటరిగ బాధపడుతుంది.. దాని రాకతో కాస్త మనస్సు కుదుటపడింది..

''..ఏంటే ఆలోచిస్తున్నావు! మీవారు ఎలా వుంటారు? మీ దాంపత్యం ఎలా వుంది! హాపీయా! గలగలా మాట్లాడుతున్న దాన్ని చూస్తుంటే నిజం చెప్పాలా! వద్దా! అనిపించింది... కానీ ఆలోచించితే వద్దు అని మనస్సులో తనకి అనిపించి మానుకొంది.

''మాకేమే మేము హాయిగ వున్నాము... నీ సంగతి చెప్పు. నీవింక పెళ్లి చేసుకోలేదేం?'' ప్రభతో అంది శ్రీలత.

''పెళ్లికి ఇంక టైము రాలేదు గానీ.. మీ శ్రీవారు ఎలా వుంటారు! అందంగ వుంటారా! నీ పెళ్లికి నేను బెంగుళూరులో వుండి రాలేకపోయాను.. ఆయన పేరేంటి?'' ఉత్సాహంగ అడిగింది స్నేహప్రభ.

''మావారు నాకన్నా బాగుంటారు. పేరు శ్రీకాంత్. నన్ను బాగ చూసుకుంటారు! అంతాసరేగాని నీవు ఎవరినైన ప్రేమించావా! ప్రేమించి పెళ్లి చేసుకోవాలని కాలేజిలో తెగ లెక్చర్లు దంచేదానివి... పోనీ ఆ ప్రపోజల్లో వున్నావా ఏమి!.. చెప్పవే... త్వరగ నిన్ను చూస్తుంటే నాకు జెలసీగా వుంది''– దానికి దగ్గర జరుగుతు అన్నది శ్రీలత..

''అబ్బే అదేం లేదు'' కాస్త సిగ్గు పడుతు అన్నది స్నేహప్రభ.

''మీ ఆయన అపర ప్రవరాఖ్యుడా! కాలేజీలో మనం చర్చించుకొనేవాళ్లం. మనకు కాబోయే భర్తలు ఇలా వుండాలీ అని.. ఎవరికి వాళ్లు పెళ్లి చేసుకొని వెళ్లిపోయినారు. నీవు, నేను మిగిలాము.. నాకు కాలేదు..

నీవు కోరుకున్నట్లు శ్రీరామచంద్రుడే అయివుంటాడు.. కనీసం మీ పెళ్లి ఆల్బమ్ అయిన చూపించవే. చూసి ఆనందిస్తాను..'' అంటూ వ్యంగ్యంగ దానిని ఆటపట్టిస్తూ అన్నది స్నేహప్రభ. టైము మూడు పదిహేను నిమిషాలయింది. లేచి అల్మారాలో వున్న ఆల్బమ్ దానికిస్తూ ''టిఫిన్ చేసి తీసుకొని వస్తాను. అందాక చూస్తూవుండు'' అంటూ వంట ఇంట్లోకి వెళ్లింది శ్రీలత.

''వుల్లిపాయ పకోడీలంటే నీకిష్టం కదా! అవి చేయనా, మిరపకాయ బజ్జీలు చెయ్యనా!.. లేకపోతే రెండు చేసి తీసుకొనిరానా.. వంటింట్లోంచే అడుగుతున్న శ్రీలత మాటలకి ఎంతకీ సమాధానం రాకపోయే సరికి పిండి చేత్తోనే వచ్చింది గదిలోకి శ్రీలత..

''..నేను ఇన్నిసార్లు గొంతు చించుకొని అరుస్తుంటే నీవేమి మాట్లాడవేమే!'' అంటూ దానిని మళ్లీ అడిగింది శ్రీలత..

''ఏదో ఒకటి చెయ్యి.. నీ యిష్టం'' అంటూ ఆల్బం మూసేసి బాత్‌రూములోకి వెళ్లింది స్నేహప్రభ..

''రెండూ తింటే ఇమడం.. ఒకటే చేస్తాను'' అంటూ వంటింట్లోకి వెళ్లింది శ్రీలత..

రెండు ప్లేట్లలో పకోడీలు తీసుకొని వచ్చి కూర్చుంది హాల్లో.. దానిముందు ప్లేటుంచి.. ''తినవే త్వరగ. చల్లారిపోతాయి.. తరువాత జడ వేసుకోవచ్చు..'' అంటు దానిని బలవంతపెట్టింది తినమని... శ్రీలత..

''అర్జంటుగ వెళ్లాలి. వచ్చినపని మరిచేపోయాను.. అందుకే తయారవుతున్నానే.. సారీ.. ఏమి అనుకోవద్దు... ఆఫీసు పని జ్ఞాపకము వచ్చింది.. అందుకే ఈ తొందర'' ఒక్కొక్క పకోడిని తీసుకొని తింటూ.. అన్నది స్నేహప్రభ..

''రెండు రోజులుంటానని చెప్పి ఈ తొందర ఏమిటే.. అంత అర్జంటు పనా అది..'' కొంచెం బాధగానే అన్నది శ్రీలత. ''అవునే చాల అర్జంటు.. అందుకే ఈ తొందర...'' అంటూనే బ్యాగ్‌లో అది మధ్యలో వీలున్నప్పుడు తినమని ఇచ్చిన పకోడి పొట్లం పెట్టుకొని బయలుదేరింది స్నేహప్రభ..

''వుండవే ప్రభా నా అడ్రసు.. నీవు వెళ్లి నీ అడ్రసుతో లెటరు వ్రాయి- మరిచేపోవు కదూ!'' రెండు రోజులు దానితో హాయిగ, సంతోషంగ మాట్లాడుదామని ఎన్నో అనుకుంది తను.. కానీ అవి ఏమి జరగవు అని నాకు ముందే అనిపించిన బాగుండేది.. అంత బాధపడి వుండేదాన్ని కాదు...''

''దేని గురించి అంత దీర్ఘంగ ఆలోచిస్తున్నావు? నా గురించే కదూ! సారీనే... నేను వెళ్లి నీకు లెటరు వ్రాస్తాను.. బై..'' అంటూనే రోడ్డు దాటింది ప్రభ..

..అది కనిపించేవరకు చూసి లోపలికి వెళ్లింది గబగబా.. స్టౌ మీద పాలు పెట్టిన విషయం గుర్తురాగానే... కానీ అప్పటికే పాలు పొంగిపోయాయి..'' పాలు పొంగితే మంచిదేనంటారు'' మరి ఆ మంచి నాకు కాదా!

• • •

రెండు వారాలనుంచి భర్త ఇంటికి వస్తున్నాడు తొందరగ. ప్రతి శుక్రవారం సాయంత్రం వెళ్లి సోమవారం ఉదయంగాని రారు.. అలాంటిది ఎక్కడికి వెళ్లకుండ ఇంటికి రావడం తనకి ఆశ్చర్యమేసింది. తొందరగ ఇంటికి వచ్చిన శ్రీకాంత్ అడిగింది శ్రీలత..

''వంట్లో బాగుండలేదా!.. ఇన్ని రోజుల నుంచి అడగవలసిన ప్రశ్న ఈరోజు భర్తని అడిగింది...

తన మాటలు వినబడినవో లేవో తెలియదుకానీ.. మౌనంగ వూరుకున్నాడు.. మళ్లీ తనే మాట్లాడింది.

''ఆరోగ్యం సరిగ్గా లేకపోతే డాక్టరు దగ్గరికి వెళదాము'' మంచం దగ్గరగా వచ్చి అన్నది శ్రీలత.

''కనిపించటంలేదు.. నేను బాగానే వున్నాను'' అంటూ దుప్పటి ముసుగుపెట్టి పడుకున్నాడు.. శ్రీకాంత్.. శ్రీకాంత్‌కి మాత్రం అనుమానంగానే వున్నది. చలితో ఒణుకుతున్నట్టుగ తనకి కనిపించినది.. నిజానికి ఆయన ఏదో విషయంలో బాధపడుతున్నారు.. లేచిన తరువాత ఎలాగైన ఆయనని ఒప్పించి డాక్టరు దగ్గరికి తీసుకొని వెళ్లాలి. తప్పదు'' అనుకున్నది మనస్సులో శ్రీలత. ఏది ఏమైనా కొద్దిరోజుల నుంచి తను గమనిస్తునే వుంది ఆఫీసునుంచి ఇంటికి రావటం చేస్తున్నారు.. క్యాంపులు వెళ్లకుండ ఇంటిదగ్గరే శలవురోజుల్లో గడుపుతున్నారు.

''ఇన్నాళ్లకి ఏ దేవతో తన మొర ఆలకించి నా జీవితం బాగుచేసింది.. భగవంతుడు వున్నాడు అనటానికి ఇది ఒక నిదర్శనం.''

భర్తని ఒప్పించి డాక్టరు దగ్గరికి తీసుకొనివెళ్లి పూర్తిగ నయం చేయించింది శ్రీలత. భర్త చేతికి టాబిలెట్ ఇస్తూ మంచినీళ్ల గ్లాసు పట్టుకొని.. ''మాత్ర వేసుకోండి'' అంటూ ప్రక్కన కూర్చొంది తను.

''వద్దు శ్రీలత. నాకింక మందులతో పనిలేదు.. నీవు ఎప్పుడు నా ప్రక్కన వుంటే చాలు.. నన్ను విడిచిపెట్టి ఎక్కడికి వెళ్లకు'' అంటు తన ఒడిలో తలపెట్టి చిన్నపిల్లాడిలాగ ఏడవటం మొదలుపెట్టారు.

భర్తని ఇలా పిరికివాడిలా తను ఎప్పుడు చూడలేదు.

''చేయరాని తప్పు మీరేం చేసారని... చేసిన తప్పు ఏమిటో తెలుసుకొని మీరు మారారు.. అలా ఎంత మంది తమ తప్పుని తెలుసుకుంటారు. ప్లీజ్ వూరుకోండి'' అంటూ పైటచెంగుతో భర్త కళ్లని తుడిచి..

''మిమ్మల్ని విడిచి నేనెక్కడికి వెళ్లను.. సరేనా!... ఒకవేళ వెళ్లినా ఇద్దరం కలిసే వెళదాము..'' అంటూ భర్త తల నిమురుతూ ప్రేమతో గుండెలకి హత్తుకుంది శ్రీలత.

★

## ప్రొఫెసర్‌గారి స్నానం

ఓ స్వీడిష్ ప్రొఫెసర్‌గారు ఓస్లో యూనివర్శిటీని కోర్టుకు ఈడ్చారు. అసలు జరిగింది ఏమంటే, మేధావి అయిన ఆ ప్రొఫెసర్ ఏనాడూ స్నానం చెయ్యడు- శరీరానికి సబ్బుపెట్టి ఎరగడు. ఆయన వస్తుంటేచాలు విద్యార్థులూ, సాటి ప్రొఫెసర్లు, లెక్చరర్లు ముక్కులకు కర్చీఫ్‌లను అడ్డంగా పెట్టుకొనేవారు. కొందరైతే దూరంగా పరుగులు తీసేవారు. 20సంవత్సరాలుగా ఆయనగారు సబ్బును ముట్టకుండా, రకరకాల దుర్వాసనలలో మునిగితేలుతున్నాడు. చివరికి ఈమధ్య విద్యార్థులు, లెక్చరర్లు కూడబలుక్కొని, ఆ వాసనల వీరుణ్ణి ఓరోజున యూనివర్శిటీ నుంచి గెంటివేశారు. సదరు ప్రొఫెసర్‌గారు కోర్టుకు వెళ్లారు. తన శరీరం, దానినుంచి వాసనలు తన హక్కులకు సంబంధించినవనీ, ఆ హక్కులను నిరోధించే హక్కు ఎవ్వరికీ లేదనీ ఆయన కోర్టువారికి చెప్పాడు. కోర్టువారు యూనివర్శిటీవారిని కోప్పడి, ప్రొఫెసర్‌గారికి స్నానం చేసి యూనివర్శిటీకి వెళ్లమని సలహా చెప్పారు.

## కంప్యూటర్ వైద్యుడు

2001వ సంవత్సరానికి రోగనిర్ధారణ కంప్యూటర్‌ల సహాయంతో తెలుస్తుందని శాస్త్రజ్ఞులు అన్నారు. తెరపై, రోగులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయి. ఇప్పటికిప్పుడే ఇంగ్లాండులోని గ్లాస్గోలో ఇందు గురించిన ప్రయత్నాలు తీవ్రంగా జరుగుతున్నాయి. 20సంవత్సరాల్లో రోబోట్స్ సర్జన్ల నేతృత్వంలో, శరీరంలోని బహు సున్నితమైన ప్రదేశాల్లో ఆపరేషన్లు చేస్తామని శాస్త్రజ్ఞులు అన్నారు.

-కొడిమెల

